నేటివార్త
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 26 అక్టోబర్ 2025

భారీ వర్షాల హెచ్చరికలతో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలి

రాజంపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం పుల్లంపేట తాసిల్దార్ కార్యాలయం గుంజానా నది పరివాహక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ముందుగా రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి కంట్రోల్ రూమ్, సహాయక చర్యల ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ భావనకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం పుల్లంపేట తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భారీ వర్షాలు నేపథ్యంలో సంసిద్ధతపై తాసిల్దార్ , ఎంపీడీవోకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం గుంజన నది పరివాహ ప్రాంతాన్ని పరిశీలించి, నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో అన్ని సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని వివిధ శాఖల జిల్లా అధికారులను, అన్ని మండలాల తాసిల్దారులను, ఎంపీడీవోలను ఆదేశించారు.

సీఎం పర్యటనపెద్ద ఎత్తున ఏర్పాట్ల కార్యక్రమాలు

చిన్నమండెం అక్టోబర్ 25 ప్రభాత వార్త:

మండలంలో ఈనెల 29వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఉన్నతాధికారుల మండలంలో పర్యటించారు.పర్యటనను పకడ్బందీగా నిర్వహించే టందుకు శనివారం జిల్లా యంత్రాంగం మొత్తం పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని చెప్పుకోవచ్చు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శన్ రాజేందర్, ఆర్డీవో శ్రీనివాసులు, రాయచోటి తహసిల్దార్ నరసింహ కుమార్, చిన్నమండెం తాసిల్దార్ నరసింహులు, ఎస్సి సిఐ రాజా రమేష్ ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాలను పరిశీలించి ఎంపిక చేశారు. ఇందులో మండల కేంద్రానికి దగ్గరలో కడప బెంగళూరు జాతీయ రహదారి ఆనుకొని దేవపట్ల రోడ్డు క్రాస్ వద్ద ఉన్న సెరికల్చర్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి దిగే హెలిపాడ్ ను గుర్తించారు. అలాగే మండల కేంద్రంలోని హెచ్ పి పెట్రోల్ బంక్ వెనకాల ఉన్న ప్రభుత్వం నిర్మించిన ఇంటి నిర్మాణాలలో పేదలందరికీ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా హేమలత మరియు ముంతాజ్ బేగం లకు నూతనంగా నిర్మించిన ఇంటి తాళాలను సీఎం చేతుల మీదుగా ఇస్తారు .అనంతరం దేవగుడిపల్లి బాపూజీ నగర్ కాలనీ మధ్యలో కడప బెంగళూరు జాతీయ రహదారి అనుకుని ఉన్న ప్రదేశంలో బహిరంగ సభకు ఏర్పాట్లను అధికారులు చక చకా చేస్తున్నారు.

పాలకులను నిలదీస్తేనే ప్రాజెక్టులు పూర్తి

అన్నమయ్య ప్రాజెక్టు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

సాగునీటి ప్రాజెక్టుల అధ్యయన బృందం డిమాండ్

రాజంపేట,అక్టోబర్ 25 ప్రభాతవార్త

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పట్ల పాలకుల్లో చిత్తశుద్ధి లోపించిందని అందువల్ల ప్రజలు నిలదీస్తేనే పూర్తవుతాయని సాగునీటి ప్రాజెక్టుల అధ్యయన బృందం సూచించింది. ప్రజలు పోరాట ధోరణి అవలంబించకుంటే ప్రాజెక్టుల నిర్మాణంలో విపరీతమైన జాప్యం చూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అందుకు ఉదాహరణగా 37 ఏళ్ల క్రితం ప్రారంభించిన గాలేరు నగరి ప్రాజెక్టు, నాలుగేళ్ల క్రితం కొట్టుకపోయినా ఇంతవరకు అన్నమయ్య ప్రాజెక్టు ను పట్టించుకోకపోవడాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. ఉమ్మడి కడప చిత్తూరు జిల్లాల పరిధిలో 2.55 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే గాలేరు నగరి రెండవ దశ నిర్మాణ పనులు సత్వరమే మొదలుపెట్టి పూర్తి చేయాలనీ, కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సాగునీటి ప్రాజెక్టుల అధ్యయనం ఆలోచన పరుల వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం బృందం సభ్యులువిశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబి వెంకటేశ్వరరావు, రైతు సేవా సంస్థ, అధ్యక్షులు అక్కినేని భవానీ ప్రసాద్, జలవనరులు, సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకులు టి. లక్ష్మీనారాయణ, సెంటర్ ఫర్ లిబర్టీ, అధ్యక్షులు నలమోతు చక్రవర్తిలతో కూడిన ప్రతినిధి బృందం తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988లో గాలేరు నగరి సుజల స్రవంతికి శంకుస్థాపన చేశారని అది నేటికీ 37 సంవత్సరాలైనా పాలకుల నిరక్ష్యం కారణంగా ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతం లో ఉన్నటువంటి ఈ గాలేరు నగరి సుజల స్రవంతికి ఈ ప్రాంతం నుంచి ముఖ్యంగా చిత్తూరు కడప జిల్లాల నుండి ముఖ్యమంత్రులు అయినప్పటికీ ఈ ప్రాజెక్టు కు నిధులు కేటాయించకపోవడం చాలా దుర్మార్గమని వ్యాఖ్యానించారు. నిత్యం రైతుల ప్రభుత్వం రైతులకు మేలు చేస్తామని చెప్పడం తప్పితే ఏ ఒక్కటి రైతులకు అందించినటువంటి పాపాన పోలేదని విమర్శించారు.37 సంవత్సరాలుగా గాలేరు నగరి ప్రాజెక్టు పూర్తి కాలేదంటే పాలకులకు ఎటువంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు. కడప జిల్లాకు 1,55,000 ఎకరాలకు, చిత్తూరు జిల్లాకు 1, 05000, ఎకరాలకు గాలేరు నగరి సుజల స్రవంతి పూర్తి కావడం ద్వారా నీరు అందుతుందన్నారు. అటువంటి పెద్ద ప్రాజెక్టును పాలకులు ఎందుకు పట్టించుకోలేదని వారు ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా రాజంపేట రైల్వే కోడూరు నియోజకవర్గాలలో ఉన్నటువంటి చిన్న పెద్ద చెరువులు నిండి భూగర్భ జలాలు నిండుగా ఉంటాయని వివరించారు. కొన్ని ప్రాంతాలలో 1800 అడుగులు బోర్లు వేస్తే గాని ఈ ప్రాంతంలో నీరు అందడం లేదంటే ఎంత దుర్భిక్షంలో ఉన్నామో అర్థమవుతున్నదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి కళ్ళు తెరిచి ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. పాలకుల నిరక్ష్యం కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు వరదలకు కొట్టుకొని పోయి నాలుగు సంవత్సరాలు అవుతున్న నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఎందుకు పనులు మొదలుపెట్టడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కావచ్చు గత ప్రభుత్వంలో ఉన్న

అన్నమయ్య ప్రాజెక్టు ను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు బృందం

జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు కావచ్చు ప్రాజెక్టు అవసరాలని నిమిత్తం నిధులు కేటాయించమని అడిగితే కేటాయించకుండా అశ్రద్ధ చేసి ప్రాజెక్టు కొట్టుకొని పోయే విధంగా చేశారని వారు ఆరోపించారు. 1976లో ఈ ప్రాంత అవసరాల నిమిత్తం అప్పటి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తే 8 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం జరిగితే నేడు పాలకుల నిరక్ష్యం కారణంగా అది 800 కోట్లకు చేరిందని ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన సుమారు 22,500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వెంటనే ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చిన నీరు వచ్చినట్టు సముద్రం పాలు కాకుండా ఈ ప్రాంత వాసులకు అవసరాలకు ఉపయోగపడే విధంగా పాలకులు ఆలోచన చేయాలని సూచించారు. ఆలోచన పరుల వేదిక సభ్యులు రాయలసీమ ప్రాంతంలో ఉన్నటువంటి నీటిపారుదల ప్రాజెక్టుల పైన అధ్యయనం చేస్తున్నామని ఈ అధ్యయనం తర్వాత సమగ్రమైనటువంటి రిపోర్టు ప్రభుత్వం కు సమర్పించి ఒత్తిడి తేవడానికి ప్రాజెక్టులో స్థితిగతులు మార్చడానికి ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్నటువంటి రైతాంగం తో పాటు ప్రజా సంఘాలు ఈ ప్రాంత అభివృద్ధి కోరుకునే వారు పాలకులను నిలదీయాలని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజానీకం ఆరోగ్యంగా ఉండాలంటే నీటి అవసరం చాలా ముఖ్యమని అన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఎన్నిక కాబడిన పాలకులు ఇంత దయనీయంగా నీటి వనరుల పైన అవస్థలు పడుతూ ఉంటే ప్రజా ప్రతినిధులకు పట్టకుండా వ్యవహరించడం చాలా శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మహేష్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్ ఈశ్వరయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్, హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు పలుకూరి వెంకటరమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర, నరసింహులు మహమ్మద్ హుస్సేన్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

27,28న పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీలకు సెలవు

ఎడ్యుకేషన్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

"మొంథా"తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, మరియు అంగన్వాడీ కేంద్రాలకు ఈ నెల 27,28 వ తేదీలలో (సోమవారం మంగళ వారం)సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

రానున్న మూడు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వరదలు మరియు భారీ వర్షాల విపత్తు నిర్వహణపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు రోజులు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నమయ్య జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ఇవ్వడం జరిగిందని, ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి అందరూ ఉద్యోగులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు వర్షపాత నమోదును ఎప్పటికప్పుడు మండల జిల్లా స్థాయిలో తెలిసే విధంగా చూడాలని సంబంధిత శాఖను ఆదేశించారు. భారీ వర్షం కారణంగా పశువులు, గొర్రెలు, మేకలను వాగులు వంకలు దాటే సమయంలో పై నుండి వరద నీరుని ప్రవహించే ప్రదేశాలలో వెళ్లకుండా పశువుల కాపర్లు చూసే విధంగా వారికి అవగాహన కల్పించేలా పశుసంవర్ధక శాఖ అధికారులు, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు పనిచేయాలన్నారు. కోతకు వచ్చిన పంటలను వాయిదా వేసుకునేలా, పండించిన ధాన్యాన్ని భద్రపరిచే విధంగా రైతులకు మండల, జిల్లా స్థాయిలో ఉన్నటువంటి అధికారులు అవగాహన కల్పించి ఎలాంటి పంట నష్టం జరగకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను సూచించారు. గ్రామ పంచాయతీలలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తొందరలో డెలివరీ అయ్యే గర్భిణీ స్త్రీలను దగ్గరలో ఉన్న వారిని అత్యవసరమైతే పీహెచ్సీలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్య శాఖ అధికారులు ఆదేశించారు. ముందస్తు సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసే ప్రదేశాలలో అవసరమైతే ప్రజలను ఆ ప్రాంతాలలో ఉంచే సమయంలో స్త్రీలకు, పురుషులకు ప్రత్యేక ఏర్పాట్లు, వారికి భోజన, త్రాగునీటి సౌకర్యం సానిటేషన్ తదితర ఏర్పాట్లకు బాధ్యత గల సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, పంచాయితీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మరియు ఇతర శాఖల వారితో సమన్వయం చేసుకొని అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ, వారికి కావలసిన మందులు ఉండేలా చూడాలన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తూ ఏలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గుంతలు, కాలువలు, వాగులు వంతెనలు వద్ద అధికంగా ప్రవహించే ప్రాంతాలలో , అలాగే పట్టణ ప్రాంతాలలో నాళాలలో గుంత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో, వాహనాల మళ్లింపు ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు మున్సిపల్ కమిషనర్లు తాసిల్దార్లు ఇతర సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని, ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవించే అవకాశం ఉన్న జరిగిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ కూడా తెలియజేయాలని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్ నాథ్ హెగ్డే, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డిపిఓ, వ్యవసాయ శాఖ, డిఎంహెచ్ఓ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పశుసంవర్ధక శాఖ హార్టికల్చర్ అధికారులు, తహశీల్దార్లు, MCలు, MPDOలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, PR, R!!B, RWS, నీటిపారుదల, విద్యుత్, పంచాయతీ, అగ్నిమాపక శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్

కడప,అక్టోబర్ 25 ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రాజెక్టుల జలాశయాలు, నదీ పరివాహ ప్రాంతాలు, చెరువులు, కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యం లో జిల్లా లో పరిస్థితులపై.. జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ జిల్లా స్థాయి,క్షేత్ర స్థాయి అధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా లో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్ల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చిన్నపిల్లలు, యువకులు అత్యుత్సాహంగా కాలువలు, కుంటలు, చెరువులకు ఈతకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ,మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి ప్రధాన కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి జిల్లాలోని కుందూ, పెన్నా పరివాహక ప్రాంతాలతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయన్నారు. అందుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని ప్రాథమిక అంచనా వేస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా ప్రాణ నష్టం జరగలేదని, అంతే కాక మరికొన్ని చోట్ల గ్రామీణ రోడ్లు, కొన్ని నిర్మాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ,ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. తుఫాను ఇంకా కొనసాగుతుండడంతో జిల్లాలో ఎక్కడా పాడి సంరక్షణకు, పశు నష్టం జరగకుండాపశుసంవర్ధక సహాయకులు బాధ్యత వహించాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే.. వెంటనే దానిని పునరుద్ధరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విపత్తు సమయంలో ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది మరింత బాధ్యతతో వారి విధులను నిర్వర్తించాలన్నారు. ముందస్తు జాగ్రత్తగా తాత్కాలిక షెల్టర్లను సిద్ధం చేసుకోవాలని మండల తహశీల్దార్లను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్ సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటు లో ఉండాలని అవసరమైన మందులను అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారులను ఆదేశించారు. అత్యవసర సహాయ సమాచార నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఓ కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 246344 ఆర్డీవో కార్యాలయం, కడప : 08562 295990!!! ఆర్డీవో కార్యాలయం, జమ్మలమడుగు : 95028 36762, ఆర్డీవో కార్యాలయం, బద్వేలు : 6301432849, ఆర్డీవో కార్యాలయం, పులివెందుల : 8919134718 భారీవర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూమ్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చని, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబర్లతో పాటు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు కానీ ఫోన్ ద్వారా తెలియ జేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సూచించారు.

సింగంవారిపల్లెలో భూమి కంపించిందని గ్రామస్థుల భయాందోళ

రామసముద్రం అక్టోబర్ 25ప్రభాతవార్త

రామసముద్రం మండలం మాలేనతం పంచాయతి సింగం వారి పల్లెలో భూమి కాంపించిందని గ్రామస్తులు భయాందోళనలతో ఇల్లలోనుండి బయటికి వచ్చేసారు. గ్రామస్థుల వివరాల మెరకు శనివారం సాయంకాలం 6:54 నిముషాలకు పల్లెలో భూమి 2 సార్లు కంపించింది. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చాయి, దీనివలన ఇళ్లలోని సామగ్రి క్రింద పడిపోయాయి. ప్రజలు భయభ్రాంతులకు లోనై ఇంటి నుండి బయటికి వచ్చేసారు .అయితే ఇది పిడుగు పాటు శబ్దం అయ్యి ఉంటుందనీ కొందరు,గ్రామ సమీపంలోని క్వారి పేలుళ్ల వల్ల వచ్చిన శబ్దం అయ్యి ఉంటుందనీ కొందరు,లేదు ఇది భూకంపమే అనికొందరు అభిప్రాయ పడుతున్నట్లు తెలుస్తోంది.ఏది ఎమైన గ్రామంలో భూకంపం సంభవించిందనే వార్త చుట్టు పక్కల గ్రామాలకు వ్యాపించడంతో కలకలం రేపింది.

పొలతల పుణ్యక్షేత్రం అభివృద్ధికి కొత్త దశ

- రూ.4.90 కోట్లతో శంకుస్థాపన పనులు ప్రారంభం

పెండ్లిమర్రి, అక్టోబరు 25, ప్రభాతవార్త:



పొలతల పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులకు రూ.4.90కోట్లు కేటాయిస్తూ శంకుస్థాపనలు - ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ రూపొందించి పొలతల పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని దేవాదాయశాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలోని 90 ఆలయాలకు దూప దీప నైవేద్యం కోసం నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామంలోని శ్రీ పొలతల మల్లేశ్వర స్వామి ఆలయంలో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం అనంతరం స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర దేవాదాయశాఖాధికారులతో సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం టీడీపీ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, బద్వేలు టీడీపీ నుంచి విజయమ్మ, బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జి హృతీష్‌రెడ్డి, జనసేన కమలాపురం ఇన్‌ఛార్జి ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ కమలాపురం ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఆలయ ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. పొలతల ఛైర్మన్ సిరిగిరెడ్డి రాజారెడ్డి పొలతల పుణ్యక్షేత్రం మల్లేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మంత్రి రామ నారాయణరెడ్డి ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఛైర్మన్‌గా రాజారెడ్డిని ప్రమాణ స్వీకారం చేయించారు. పొలతల దేవస్థానం మరింత అభివృద్ధి చెందుతుందని పొలతలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆలయ ఈవో కృష్ణ నాయక్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుందూ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధ దంపతులు

భర్తను కాపాడిన స్థానికులు, భార్య గల్లంతు

గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

రాజుపాలెం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని వెళ్లాల పుణ్యక్షేత్రం వద్ద శనివారం పెద్దమడియం మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన గొంగటి రామసుబ్బారెడ్డి (82), ఆయన భార్య నాగ మునెమ్మ (76) అనే వృద్ధ దంపతులు కుందూ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు అప్రమత్తమై గుర్రప్ప(శేషు) అనే వ్యక్తి ప్రాణాలకు తెగించి వారిని కాపాడే ప్రయత్నం చేశాడు. కానీ రామసుబ్బారెడ్డిని కాపాడి ఒడ్డుకు చేర్చగలిగాడు. ఆయన భార్య నాగమునెమ్మ గల్లంతైనది. విషయం తెలుసుకున్న ఎస్సై కత్తి వెంకటరమణ, తాసిల్దార్ మనోహర్ రెడ్డి, ఎంపీడీవో రామనాథరెడ్డిలు సంఘటనా స్థలమునకు చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధులలో బ్రతికి బయటపడ్డ రామసుబ్బారెడ్డిని విచారించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒకరు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నట్లు, మరొకరు జమ్మలమడుగులో వ్యాపారం చేసుకుంటూ స్థిరపడినట్టు తెలిపారు. సొంత గ్రామం అయిన ఉప్పలూరు గ్రామంలో వృద్ధులు నివసిస్తూ జీవించేవారు. వీరికి పలు దీర్ఘకాలిక వ్యాధులు, అనారోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నందున ఈ ఘాతుకానికి పాల్పడినట్టు ఆయన వివరించటం విశేషం. గల్లంతైన నాగ మునెమ్మ ఆచూకీ కోసం ప్రొద్దుటూరు అగ్నిమాపక శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోయింది. ఆమె ఆచూకీ కోసం వారి బంధువులు అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయమై ఎస్సై వెంకటరమణ, ట్రైనీ ఎస్సై నాగ కీర్తణలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆ వృద్ధ దంపతులకు అనారోగ్య సమస్యలు వెంటాడగా విరక్తి చెంది జీవితమంతా ఒకరికొకరు తోడుగా ఉండి చివరి దశలో ఓడిపోయి ఇలా ఆత్మహత్యకు పాల్పడడం అందరినీ ఎంతగానో కలసి వేస్తున్నది.

రామసుబ్బారెడ్డిని విచారిస్తున్న అధికారులు

ఓటర్లు కు అనుకూలంగా పోలింగ్ బూత్‌లు

మదనపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ బూతులను ఏర్పాటు చేయాలని వివిధ రాజకీయ పార్టీ నాయకులు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి విన్నవించారు. శనివారం సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, బి ఎల్ ఓ లతో సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లె నియోజకవర్గంలో గతంలో ఉన్న పోలింగ్ బూతులకు అదనంగా మరో 65 బూతులు కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందని, కొత్తగా ఓటర్ల జాబితా పరిశీలించి అభిప్రాయాలు వెల్లడించాలని సబ్ కలెక్టర్ కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ మదనపల్లె టౌన్, రూరల్ ప్రాంతంలో నివసించే వారికి వారు నివసించే ప్రాంతంలో కాకుండా గతంలో నివసించే ప్రాంతంలో ఓట్లు ఉన్నాయని, దానిపై సమగ్ర పరిశీలన చేసి వారు నివసించే చోట ఓటు హక్కు కల్పించాలని సూచించారు. సబ్

చేనేత రంగానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

మదనపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. భారత ప్రభుత్వం చేనేత,జౌళి మంత్రిత్వ శాఖ 2023 24 సంవత్సరానికిగాను 4 స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పథకంలో భాగంగా మదనపల్లి నియోజకవర్గంలోని కోళ్ల బైలు, రాజానగర్, నీరుగట్టువారిపల్లి, మదనపల్లి రూరల్ ప్రాంతాలకు చేనేత మగ్గాలు,పరికరాలు మంజూరయ్యాయి. శనివారం కాట్లాటపల్లి రోడ్డులోని శ్రీనివాస కళ్యాణ మండపం నందు జిల్లా చేనేత,జౌళి శాఖాధికారి ఆర్.పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులైన చేనేత కార్మికులకు మగ్గాలు,మగ్గం పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగంపై ఎక్కువమంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారి శ్రేయస్సు కోసం తాము పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడెం సిద్దప్ప,రామిశెట్టి ఆంజనేయులు, నీలకంఠ,రాటకొండ శ్రీనివాసులు నాయుడు,రామిశెట్టి కృష్ణ (కమలామర్రి),రామిశెట్టి నీలకంఠ,నవీన్ చౌదరి,కొరముట్ల నాగరాజు,మోడెం నాగరాజు, ఎస్.రెడ్డి షంషీర్,యర్రబల్లి వెంకటరమణా రెడ్డి,బీదం గురునాథ్ యాదవ్, తమ్మిశెట్టి రామకృష్ణ,5వ వార్డు కొప్పల హరినాథ్,బోనాసి జాన్ బాబు,డి.రమేష్ రెడ్డి,ఉప సర్పంచ్ శ్రీనాథ్,చల్లా చలపతి,ఎం.వేమయ్య,రామిశెట్టి రెడ్డి కేశవ,బండి పవన్ కుమార్,రాగినేని రఘుపతి నాయుడు,బాలమాలి శేఖర్, చేనేత విభాగం నాయకులు వెంకటరమణ,ఎంపీడీవో తాజ్ మాస్రూర్,వీఆర్వో మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు మంజుల,గిరిధర్ నాయక్, పెద్దఎత్తున చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ రేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మదనపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

మదనపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో తుఫాన్ ప్రభావంగా భారీ వర్షాలు పడే సూచన ఉన్నడంతో సబ్ కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా అత్యవసరం ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 08571231181కు సంప్రదించాలని కోరారు

విద్యార్థులు క్రీడా రంగంలో ఘన విజయాలు

వేంపల్లె అక్టోబర్ 25:(ప్రభాత వార్త)

శ్రీ చైతన్య హైస్కూల్ పాఠశాల విద్యార్థులు ఎస్జిఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) నిర్వహించిన క్రీడా పోటీలలో అద్భుత ప్రతిభను కనబరిచారు. కడప జిల్లాలో నిర్వహించిన ఎస్జిఎఫ్ అండర్-14 మరియు అండర్-17 బాస్కెట్ బాల్ సెలెక్షన్లలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు జి.వి.చరణ్ మరియు ఎస్. భరత్వాజ్ రెడ్డి అంతర్ జిల్లా పోటీలకు ఎంపిక అయ్యారు. అలాగే పులివెందులలో జరిగిన అథ్లెటిక్స్ డివిజనల్ స్థాయి పోటీలలో శ్రీ చైతన్య విద్యార్థులు వివిధ ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఈవెంట్స్‌లో జావెలిన్ త్రో, హైజంప్, లాంగ్ జంప్,100 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ. పరుగులు మరియు డిస్కస్ త్రో పోటీలలో జిల్లా స్థాయి సెలెక్షన్ పొందిన విద్యార్థులు కే. గౌతమ్, జి. తేజవర్ధన్, ఎ. సంతోష్, వై. అరుణ్ కుమార్ రెడ్డి మరియు మైనావతి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో కూడా ఇలాగే అద్భుత ఫలితాలు సాధించాలని తెలిపారు.

ఏపీఎస్ఆర్టీసీలో పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్

మదనపల్లె అక్టోబర్ 25 ప్రభాతవార్త

ఏపీఎస్ఆర్టీసీలో పదోన్నతులకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు,కార్మికులు సంబరాలు చేసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో శనివారం మదనపల్లి ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషాని యూనియన్ నాయకులు,ఆర్టీసీ కార్మికులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీసీ కార్మికుల నిర్విరామ సేవలను గుర్తించి విభాగాల వారీగా అర్హులైన వారికి పదోన్నతులు కల్పించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈయు జిల్లా అధ్యక్షుడు సిఏ బాబు,ఒకటవ డిపో సెక్రటరీ ఈశ్వరప్ప,డిపో అధ్యక్షుడు మధు,రెండవ డిపో అధ్యక్షుడు యు.నరసింహులు,జాయింట్ సెక్రెటరీలు,బిసిఎస్ నాయక్,యు.సి శేఖర్,వైస్ ప్రెసిడెంట్ ఎన్.కుమార్,బావా జాన్ లు పాల్గొన్నారు.

కలికిరి ఎంఈవో-1గా ఆర్.సురేష్

కలికిరి, అక్టోబరు 25, ప్రభాతవార్త:

కలికిరి మండల విద్యాశాఖాధికారి-1(ఎంఈవో-1)గా ఆర్.సురేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గవర్నమెంట్ హైస్కూలు పుత్తూరు పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ (బయాలజీ)గా పని చేస్తున్నారు. ఇటీవల ఆయనకు ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్ ఛార్జ్) ఎంఈవో-1గా నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో-2 నాగార్జున, కలికిరి ఉపాధ్యాయ బృందం మరియు ఎంఆర్సీ సిబ్బంది హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీ సభ్యులు సురేష్, భాస్కర, ఆది, హరి, రియూజ్, జగదీష్, ఎంఐఎస్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద ఇల్లు మంజూరు

సుండుపల్లి,అక్టోబర్ 25,ప్రభాతవార్త :

మండ్నలలోని కొత్తగా ఇల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం వారు కల్పించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద ద్వారా లబ్ధిదారులకు హౌసింగ్ డిపార్ట్‌మెంట్ రూ.1,20,000, 90 మందిస్ కింద రూ.27,000,టాయిలెట్ నిర్మాణానికి రూ.12,000 మంజూరు చేయబడుతుంది.కొత్త ఇల్లు నిర్మాణం కోసం ఆన్లైన్ ద్వారా గానిగ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు కోసం అవసరమైన పత్రాలు భర్త భార్య ఆధార్ కార్డు రేషన్ కార్డు డీఫారమ్ కుల ధ్రువీకరణ ఆదాయ సర్టిఫికేట్ ఫోటోలు జాబ్ కార్డు బ్యాంక్ బుక్ తీసుకవెళ్లి నవంబర్ 5 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి హౌసింగ్ ఏఈ జి.రెడ్డి తెలిపారు.

డివిజనల్ పంచాయతీ శాఖ అధికారి సమీక్ష

రాజుపాలెం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జమ్మలమడుగు డివిజనల్ పంచాయతీ శాఖ అధికారి నూర్జహాన్ మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, త్రాగునీరు, స్వామిత్ర కార్యక్రమాలు పైన చేపడుతున్న కార్యక్రమాల గురించి గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో గ్రామ పంచాయతీ పరిపాలన పైన అన్ని విషయాలను సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి షాకీర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి నూతన ఎస్సైగా మోహన్‌కుమార్

పెండ్లిమర్రి, అక్టోబరు 25, ప్రభాతవార్త:

ఎస్సైగా మోహన్‌కుమార్ గౌడ్ శనివారం నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మోహన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

ప్రాణాలకు తెగించి కాపాడారు

రాజుపాలెం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని వెళ్లాల పుణ్యక్షేత్రంలో గల కుందూ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఉప్పలూరు గ్రామానికి చెందిన గొంగటి రామసుబ్బారెడ్డిని దంపతులను వెళ్లాలకు చెందిన సాకలి శేషు అనే వ్యక్తి కుందూ నది ఉధృతి అధికంగా ఉన్న తన ప్రాణాలను లెక్క చేయకుండా మరొకరి ప్రాణాలు కాపాడుటకు తెగించి ఆ వృద్ధ దంపతుల్లో ఒకరైన రామసుబ్బారెడ్డిని కాపాడి ఒడ్డుకు చేర్చగలిగాడు. కానీ ఆయన భార్య ను కాపాడుటకు సాధ్యపడలేదు. ఏదేమైనా ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధ దంపతుల్లో ఒకరి ప్రాణాలను కాపాడి శభాష్ అనిపించుకున్నారు శేషు. నేటి సమాజంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకొనుటకు ఇలాంటి శేషు అందరికీ ఆదర్శం.

బద్వేలు పెద్ద చెరువులో క్షుద్రపూజల కలకలం

బద్వేలు ,అక్టోబర్25, ప్రభాతవార్త :

బద్వేలు పెద్ద చెరువుపై శనివారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. గుర్తు తెలియని వ్యక్తులు చెరువు కట్టపై ముగ్గు వేసి నిమ్మకాయలు, టెంకాయలు కర్పూరంతో వెలిగించడంతో అటువైపు వెళ్తున్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు. దగ్గరకు వెళ్లేసరికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పరిశీలించగా నిమ్మకాయలు, టెంకాయలు ఉండడమే కాకుండా ఒక అమ్మాయి ఫోటోకు నిమ్మకాయ సూదితో గుచ్చడంతో ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కలవారు చేరుకుని ఈ క్షుద్రపూజలు ఎవరు చేసి ఉంటారని పరిశీలించగా ఎవరూ కనపడలేదు. క్షుద్రపూజలు చేసిన తీరును చూసి ఎవరో అమ్మాయిపై ప్రయోగం చేసినట్లు స్పష్టంగా అర్థమైంది. అక్కడున్నవారు చుట్టుపక్కల గ్రామాలవారికి చెప్పడంతో అటువైపు వెళ్లేందుకు కూడా ప్రజలు భయపడ్డారు. ఈ మధ్యకాలంలో భారీ వర్షాల కారణంగా నీటితో చెరువు కలకలలాడుతుండడంతో ప్రజలు సందడి చేసేందుకు వస్తుంటారు. ఇలాంటి సమయంలో ఈ క్షుద్రపూజలు కలకలం రేపడంపై ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో పరిశీలించినట్లు తెలిపారు.

ప్రతి విద్యార్థికి ఆధార్ అప్డేట్ తప్పనిసరి.

చిట్వేలి,అక్టోబర్ 25, ప్రభాతవార్త:

అపార్ ఐడి పొందడానికి, ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డుతో పాటు ఆధార్ అప్డేట్ తప్పనిసరిగా చేయించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ పనితీరును శనివారం పర్యవేక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఇదివరకు ఆధార్ ఉన్నవారు.. పేరులో మార్పులు, ఫింగర్ అప్డేట్, ఐరిష్ , ఫోన్ నెంబర్ నమోదు తదితర అంశాలను అప్డేట్ చేయించాలని; లేనివారు కొత్త ఆధార్ పొందాలన్నారు. ఈ బాధ్యతను సంబంధిత పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు తీసుకోవాలని తెలిపారు. హెచ్ఎం దుర్గరాజు మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఎంఈఓ లు ఖాజా మొయిద్దీన్, ఈశ్వరయ్య మాట్లాడుతూ సోమవారం కూడా ఆధార్ అప్డేట్ సేవలు అందుబాటులో ఉంటాయని, నూరు శాతం లక్ష్యాన్ని పూర్తయ్యాలా సంబంధిత పాఠశాల యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త

టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణంలో గత నాలుగేళ్లుగా ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం కొర్రపాడు రోడ్డు పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజలు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నదానం నిర్వహించడం, ఇందుకోసం ఆయన మంచి నాణ్యత కలిగిన భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన మరింత కాలం పేదలకు సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్ బంగి శివ, బోడే ప్రసాద్, యేసునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి ఎన్.ఎస్.ఎస్. యూనిట్ 1 ఆధ్వర్యంలో శనివారం మొదటి రోజు భాగ్యనగర్ కాలనిలో విద్యార్థులు స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకుందామని కరస్పాండెంట్ నాగేశ్వర రెడ్డి అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామంలోని ప్లాస్టిక్, హానికర వ్యర్థాలను సేకరించి వాటిని క్లీనింగ్ విభాగానికి అందజేశారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామలక్ష్మి రెడ్డి విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. అలాగే కళాశాల ప్రెసిడెంటు జి. సుదర్శన రెడ్డి మాట్లాడుతూ భాగ్యనగర్ కాలని మొత్తం శుభ్రం చేయడంలో విద్యార్థులు కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమములో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్లు కె. నాగరాజు,ఎస్.పి. యాసిన్ , గురుప్రసాద్ అధ్యాపకుడు మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శానిటేషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరించండి

పులివెందుల అక్టోబర్ 25, ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలో వార్డ్ శానిటేషన్ మరియు పర్యావరణ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి తమ సేవా సంబంధిత సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా సిబ్బంది ఉద్యోగ చార్ట్ స్పష్టత, ప్రమోషన్లలో ప్రాధాన్యత, క్రమబద్ధీకరణ, వంటి పలు అంశాలపై ఉన్న సమస్యలను తమ అభ్యర్థనలను ఎమ్మెల్సీకి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి వివరించారు. సిబ్బంది సమస్యలను మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కార మార్గం చూపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డ్ శానిటేషన్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ డబ్ల్యూ ఈ ఎస్ 51/2024 అసోసియేషన్ ప్రతినిధులు, మరియు పలు వార్డ్ శానిటేషన్ మరియు పర్యావరణ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

బుడ్డ శనగ పంపిణీపై అవగాహన

పెండ్లిమర్రి, అక్టోబరు 25, ప్రభాతవార్త:

వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం వ్యవసాయ సిబ్బందికి బుడ్డ శనగ విత్తన పంపిణీ కార్యక్రమంపై మండల వ్యవసాయాధికారి సుమంత్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా ఆదివారం నుంచి బుడ్డశనగ విత్తన పంపిణీ కోసం రిజిస్ట్రేషన్ మొదలుపెట్టాలన్నారు. బుడ్డశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ మరియు భూమి పాస్ పుస్తకాలు జిరాక్స్ కాపీలను మరియు మొబైల్ ఫోన్ తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. బుడ్డశనగ విత్తనాల ధర క్వింటా రూ. 5850. ఒక బస్తా 20 కేజీలు. 1 ఎకరా వరకు 2 బస్తాలు, 2 ఎకరాల వరకు 4 బస్తాలు, 2 ఎకరాల పైన ఎంత భూమి ఉన్నా 5 బస్తాల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఎస్టీ,బీసీల ఫీజు తగ్గించాలి.

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 25, ప్రభాత వార్త

ఈనెల 24వ తేదీన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ టెట్ నోటిఫికేషన్ నెంబరు 1ను విడుదల చెయ్యటం జరిగిందని, ఈ టెట్ వ్రాసే అభ్యర్థులు ప్రతీ పేపర్ కి 1000 ల ఫీజును కేటాయించటం జరిగిందని ఇది ప్రతీ ఒక్కరికి భారబరింతంగా ఉందని అందులో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ప్రైవేట్ టీచర్లు అరకొర జీతాలతో, కుటుంబాలు భారంగా ఉన్నాయి కాబట్టి ప్రభుత్వం ఒకసారి ఆలోచించి ఫీజు ను తగ్గించాలని అదేవిధంగా ప్రతీ పోటీ పరీక్షలలో మరియు క్వాలిఫై పరిక్షలలో ఎస్సీ, ఎస్టి, బీసీ,వికలాంగా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది కాబట్టి, అదేవిదంగా ఓసీ అభ్యర్థులకు 500 రూపాయలుగా ఫీజు నిర్ణంచాలని, అదేవిధంగా తప్పలను టెట్ అప్లికేషన్ లో ఉచితంగా సరిచేసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పించాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు ఒకప్రకటనలో డిమాండ్ చేసారు

శిక్షల శాతం పెంచడమే లక్ష్యంగా సమీక్షా సమావేశం

కడప, అక్టోబరు 25, ప్రభాతవార్త:

జిల్లాలో నమోదయ్యే ముఖ్యమైన కేసుల్లో ముద్దాయిలను రిమాండ్ చేసే విషయంలో, రిమాండ్ ఖైదీలను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కోర్టులో హాజరుపరిచే విషయమై అలాగే కేసు విచారణ సందర్భంగా ఎదురయ్యే న్యాయపరమైన సమస్యల గురించి జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదై కోర్టుల్లో వివిధ దశల్లో పెండింగ్ ట్రయల్ కేసులు మరియు అక్విటల్ కేసులు సంబంధించిన పలు విషయాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ జిల్లాలో నమోదైన ముఖ్యమైన కేసుల్లో దర్యాప్తులు మొదలు నుంచి కోర్టులో ఆ కేసులు పూర్తయ్యేంత వరకు వచ్చే విషయాలపై, సాంకేతిక లోటుపాట్లతో కోర్టులో కేసులు వీగి పోకుండా నిందితులకు శిక్షలు పడేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కేసులు ఫైలింగ్ చేసే విధానం తదితర విషయాలను చర్చించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మరియు పోలీసు అధికారులు సమన్వయంతో గుడ్ ట్రయల్ మానిటరింగ్ చేస్తూ కేసుల్లో శిక్ష పడే విధంగా పని చేయాలని కోరారు. నేరం చేసిన వారికి శిక్ష పడుతుందో అప్పుడే బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని తద్వారా ప్రజలకు పోలీసులపై న్యాయ స్థానంపై నమ్మకం కలుగుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శ్రీమతి ఖదీరున్‌బీ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్‌కుమార్‌రెడ్డి, జిల్లాకు సంబంధించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాగును ఆటోలో పోగొట్టుకున్న వృద్ధ దంపతులు

- గంటలోపే గుర్తించి అప్పగించిన చిన్నచౌకు పోలీసులు

కడప, అక్టోబరు 25, ప్రభాతవార్త:

ఆటోలో వెళ్తూ రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి నగలున్న బ్యాగును మరిచిపోయిన వృద్ధ దంపతులకు గంటలోపే అప్పగించి శభాష్ పోలీస్ అంటూ ప్రజలచేత అభినందనలు అందుకున్నారు చిన్నచౌకు పోలీసులు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం మధ్యాహ్నం నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న దాసరి సంటెన్న(65), దాసరి గంగులమ్మ(60) దంపతులు వారి మనవడితో కలిసి నంద్యాలలో ఉన్న తమ కుమారుడు డా.రమేష్ ఇంటికి వెళ్లడానికి ఇంటి వద్ద నుంచి ఆటోలో ఆర్టీసీ బస్టాండుకు బయలుదేరారు. ఆర్టీసీ బస్టాండులోకి వచ్చే సరికి అప్పటికే స్టాండులో నంద్యాల వైపు వెళ్లే బస్సు సిద్ధంగా ఉండడంతో ఆ గాబరాలో బంగారాన్ని ఉంచిన తమ బ్యాగును ఆటో వెనక భాగంలో వదిలి గబగబా ఆటో దిగి బస్సు ఎక్కి కొంత సేపటికి తమ బ్యాగును ఆటోలో మరిచిపోయిన విషయం గుర్తించారు. వెంటనే బస్టాండులోని కానిస్టేబుల్ రవిప్రకాష్‌రెడ్డిని ఆశ్రయించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు చిన్నచౌకు సీఐ ఓబులేసుకు తెలపగా సిబ్బందిని ఆయన ఆప్రమత్తం చేశారు. సీసీ పుటేజీ ద్వారా ఆటోను గుర్తించి మొత్తం 8 తులాలు బంగారు ఆభరణాలను, 1 తులాల వెండి ఆభరణాలను బాధితులకు చిన్నచౌకు ఇన్‌స్పెక్టర్ జి.ఓబులేసు అప్పగించారు. బాధితులు ఆటో డ్రైవర్, పోలీసు అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం చేయడంలో కృషి చేసిన తమ సిబ్బందిని అభినందించారు.

ప్రతి గ్రామానికి రోడ్లు ఏర్పాటు చేస్తాం.

చిట్వేలి,అక్టోబర్ 25,ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి అవసరమైన మౌళిక వసతులను ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు.శనివారం చిట్వేలికోడూరు ప్రధాన రహదారి నుంచి జెట్టివారిపల్లి వరకు కూడా చైర్మన్ ముక్కా రూపనంద రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పాటూరు శ్రీనివాసులురెడ్డితో కలిసి 1.2 కోట్ల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రోడ్ల సౌకర్యాన్ని కల్పిస్తామని, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వారన్నారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, కాంట్రాక్టర్ పోలీసుబ్బారెడ్డి,పాములపాటి ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, గుత్తి నరసింహ,మాదాసు నరసింహ, ఎంపీటీసీ గుండయ్య, కోటేశ్వర నాయుడు, వెంకటసుబ్బారెడ్డి, పెంచల్ రెడ్డి చిన్న మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలపై ఫిర్యాదు

బద్వేలు, అక్టోబర్ 25, ప్రభాతవార్త

నియోజకవర్గంలోని కాశినాయన మండలానికి చెందిన మురుకుటి గురువు రెడ్డి సోషల్ మీడియాలో తనపై చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తాను తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా వీరారెడ్డి ఉన్నప్పటి నుంచి పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ వచ్చాను.పార్టీ పట్ల నా కృషిని, నిబద్ధతను గుర్తించి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ , యువనేత రితీష్ రెడ్డిలు కాశినాయన మండలం సొసైటీ బ్యాంకు చైర్మన్ పదవి ఇప్పించారని, అయితే అది గిట్టని కొంతమంది అజ్ఞాత వ్యక్తులు, తన పేరు మీద తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనీ , ఈ పదవి పొందడానికి 30 లక్షల రూపాయలు ఇచ్చానని,అబద్ధపు వార్తలు ప్రచారం చేస్తున్నారన్నారు . తనపై ఇలాంటి నిరాదాల వార్తలు వస్తాడంట తాను మానసికంగా ఇబ్బంది పడి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి ద్వారా పండ్ల తోటలకు ప్రోత్సహం

దువ్వూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రైతులు ఎవరైనా పండ్ల తోటల పెంపకానికి 100శాతం ఉపాధి హామీ పథకం ద్వారా రాయతీ ఇస్తున్నట్లు ఏపీవో లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఏ మేరకు

ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే ప్లాంట్ ప్రారంభం

సిద్దవటం అక్టోబర్ 25 ప్రభాతవార్త

30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్యసేవలు, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు డిసీహెచ్ఎస్ హిమవతి తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం సీహెచ్సీలో శనివారం ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే ప్లాంట్ ను డిసీహెచ్ఎస్ హిమవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అట్లూరు మండలానికి చెందిన స్నేహలత అనే గర్భిణీకి కాన్పు కష్టమవడంతో సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి సిజేరియన్ ఆపరేషన్ చేయడం జరిగిందని తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు. అలాగే గాయపడిన వారికి ఎక్స్‌రేను తీయించి ఎక్స్‌రే ప్లాంట్‌ను ప్రారంభించామన్నారు. ఆసుపత్రిలో రోగులకు గైనకాలజిస్ట్, పిడియాట్రిక్, అనస్తేషియా, జనరల్ సర్జన్, ఫిజీషియన్, సేవలు అందుబాటులో ఉంచామన్నారు. అలాగే గుండెపోటు వచ్చిన రోగికి తక్షణమే రూ. 40 వేలు విలువచేసే ట్రాంబోలైసిస్ ఇంజిక్షన్ ఆసుపత్రిలో అందుబాటులో ఉందన్నారు. గుండెపోటు సోకిన వారికి ఈసీజి తీసి అవసరమైన వారికి ఒక గంటలోపు ఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. అంతేగాక కామెర్లు సోకిన వారికి ప్రత్యేక వైద్యసేవలు కూడా ఉన్నాయన్నారు. రోగులకు అత్యవసర చికిత్సలు అందించడంతో పాటుగా ఆసుపత్రిలో లేనట్లయితే అత్యవసర మందులు కొనగోలు చేసి రోగులకు ఇవ్వడం

జరుగుతుందన్నారు. వాతావరణంలోని మార్పుల వల్ల వర్షాలు పడుతున్నందున నీటి కాలుష్యం వల్ల సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలు కాచి చల్లార్చిన నీరు మాత్రమే త్రాగాలన్నారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వలు ఉన్న చోటు లార్వా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. జ్వరాలు సోకిన వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలాల్లో వైద్యసేవలు పొందాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు చిరంజీవిరెడ్డి, డాక్టర్లు ప్రకాష్, సూర్య, తేజ దిలీప్, జోత్స్న, శివాని, హెడ్‌నర్స్, స్టాఫ్‌నర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో కంప చెట్లు తొలగింపు

ఒంటిమిట్ట అక్టోబర్.25(ప్రభాత వార్త)

మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువు చుట్టూ ఏపుగా పెరిగిన కంప చెట్లను శనివారం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పాటూరు గంగిరెడ్డి తన సహచరులతో తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన రోజుల్లో మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడంతో వర్షపు నీరు చెరువులో చేరడం జరిగిందని సంతోషం వ్యక్తం చేశాడు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ తనకు సహకరించినప్పటికీ చెరువులో ఉన్న నీరు ప్రతి ఒక్కరికి కనిపించేదుకు వీలుగా తన సహచరులతో చెరువులో ఉన్న కంప చెట్లను తొలగించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చెరువు పరిశుభ్రత పై బాధ్యత వహించి దృష్టి పెట్టి చెత్తాచెదారం, కంప చెట్లను తొలగించాలని కోరడం జరిగింది. గత కొద్ది కాలం నుంచి చెరువులో నీరు లేకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయిందని చెరువు శుభ్రం చేయకపోతే వర్షాభావం వల్ల నిల్వ ఉన్న నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని కావున చెరువు పరిశుభ్రత కోసం తాను తన సహచరులు నడుంబిగించి శుభ్రం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు భాను ప్రకాష్ రాజు, కట్ట .యానాదయ్య, బాలరాజు .శివరాజు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు

తొండూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త :

మండలంలోని మల్లెల గ్రామంలో ఉన్న మల్లెల ఇమాంబి దర్గా నందు మంగళవారం హుండీని పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. తొండూరు ఎస్సై గణ మద్దిలేటి, కానిస్టేబుల్ దొంగలను పట్టుకుని సీఐ ఎన్వి రమణ నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాజరుపరిచారు. ఈ కేసులో నంద్యాలకు చెందిన షేక్ జిన్నాబి, జమ్మలమడుగుకు చెందిన షేక్ గైబుసా ఇద్దరు చెడు అలవాట్లకు బానిసై చిన్నచిన్న దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిపై నాలుగు కేసులు ఉన్నాయి. ఈ కేసులో 30 వేల రూపాయలు నగదు మరియు హీరో కంపెనీకి చెందిన హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి వైద్య పరీక్ష అనంతరం ఇద్దరు ముద్దాయిలను పులివెందుల కోర్టు నందు ఎస్సై హాజరు పరిచారు.

మల్లెల గ్రామంలో విద్యుత్‌కు అంతరాయం

తొండూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త :

స్థానిక తొండూరు మండలంలోని మల్లెల గ్రామం నందు ఆదివారం ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 13:00గంటల వరకు సబ్‌సేటషన్ నందు పనులు జరుగుతున్నందున విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. దయచేసి ప్రజలు మరియు రైతులందరూ సహకరించవలసినదిగా తొండూరు సబ్ స్టేషన్ ఏఈ వి.బాల సంజీవులు కోరుతున్నారు. అలాగే తొండూరు మండలంలోని వివిధ గ్రామాలలో కరెంటు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నచో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు వర్షాకాలం ప్రారంభమైన కారణంగా ఎక్కడైనా కరెంటు స్తంభాలు దగ్గర కానీ ట్రాన్స్ఫార్మర్ల దగ్గర కానీ ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మంత్రిని సత్కరించిన అతికారి కృష్ణ

సిద్దవటం అక్టోబర్ 25 ప్రభాతవార్త

తిరుమల పర్యటన సందర్భంగా వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఘనంగా సత్కరించామని రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని భాకరాపేట ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం, చెప్పిన వాగ్దానాలు ప్రతి ఒకటి అమలైపోతున్నాయని రాష్ట్రంలో ఇతర దేశాల నుండి పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీల నిర్వాహకులు ముందుకొస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమినేతలు ఎన్నారై చంద్ర, అతికారి చిన్న వెంకటయ్య దేరంగుల శ్రీకాంత్, నరసింహ, జీవి రమణ, పసుపులేటి గంగయ్య, విజయ్, బాలు, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం వారోత్సవాలు

రామసముద్రం అక్టోబర్ 25 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా ప్రభుత్వ రంగంలో పలురకాల ప్రజాసేవా ఉద్యోగాలు ఉండగా అందులో పోలీస్ శాఖ ఉత్తమమైన దని కడపజిల్లా 11 బెటాలియన్ ఆర్ఐ రమణారెడ్డి తెలిపారు. అమరవీరుల స్మారక వారోత్సవాలలో భాగంగా రామసముద్రం మండలంకు చెందిన అమరవీరుడు రమేష్ స్మారక దినోత్సవం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించడం జరిగింది.కమాండర్ ఆనంద రెడ్డి ఆదేశాలతో ముఖ్య అతిథిగా ఆర్ఐ రమణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమేష్ వృత్తి రీత్యా హైదరాబాద్ లో నిశాలిబండలో విధులు నిర్వహిస్తు 2010 మే 14 న ముష్కరుల దాడిలో ప్రాణాలు కోల్పోయారని ఆయన గుర్తు చేశారు. శత్రువుల చేతిలో చనిపోతామని తెలిసినా రమేష్ వెన్ను చూపకుండా ముష్కరుల తో పోరాడి వీర మరణం పొందారని రమేష్ సాహసాలను కొనియాడారు. కాగా రమేష్ భార్య శాంతకుమారి కూడా పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గావిధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గుర్రంకొండ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. తన భర్త మృతిని స్మరించుకుంటూ ప్రతి ఏడాది అమరవీరుల స్మారక దినోత్సవం రోజున రమేష్ జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమణారెడ్డి శాంతకుమారి ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు,హైస్కూల్ చైర్మన్ చాన్ బాషా, మహ్మద్ ,ఉపాధ్యాయులు కల్పన, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెంజ్ అలర్ట్‌తో అప్రమత్తంగా ఉండాలి

పెద్దమండెం అక్టోబర్ 25 ప్రభాతవార్త

ఈనెల 26 నుండి 29 వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం తీరం దాటే అవకాశం ఉందని దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆరెంజ్ అలెర్ట్‌ను ప్రకటిస్తున్నట్లు తహసిల్దార్ తేజస్వి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రానున్న నాలుగు రోజులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు పిల్లలు బయటకు వెళ్ళనీయకుండా చూడాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే పశువులు చేపల వేటకు వెళ్లే వాళ్ళ ఈ నాలుగు రోజులు బయటికి వెళ్ళకూడదని సూచనలు తెలియజేశారు. చెట్ల కింద కరెంటు స్తంభాల కింద ఉండకూడదని స్తంభాలను తాకకూడదని సూచించారు. పాడుబడిన గోడలు ఇండ్లలో నివాసం ఉన్నవాళ్లు ప్రత్యామ్నాయంగా వేరేచోట తల దాచుకోవాలన్నారు. దీనిపై మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేనటువంటి ఆరంజ్ అల్లాటను ప్రకటించడం ఇదే మొదటిసారి అన్నారు ఎక్కడైనా వరదలకు భారీ వర్షాలకు ఈదురు గాలులకు చెరువులు కట్టలు తెగే ప్రమాదం ఉన్న ముందస్తుగా మండల అధికారులకు వీఆర్వోలకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

రామసముద్రం అక్టోబర్ 25 ప్రభాతవార్త

నేటి ఆధునిక సమాజంలో బాలికలు విద్యతో పాటు క్రీడలు అన్ని రంగల్లో రానించాలని. బాలికలు చదువుపట్ల శ్రద్ధ చూపించాలని తాహిసీల్దార్ మహ్మద్ అజారుదీన్ తెలియజేసారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం వారోత్సవాలు పురస్కరించుకొని ఏపీ మోడల్, కస్తూరిబా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాహిసీల్దార్, ఏపీ మోడల్ ప్రిన్సిపాల్, ఐసీడియస్ సూపర్ వైజర్ రమాదేవి, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్, మహిళా పోలీస్ ఉపాధ్యాయులు హాజరైనారు. ఐసీడిఎస్ రమాదేవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంతర్జాతీయ బాలికల దినోత్సవం అక్టోబర్ 11న నిర్వహించడం జరుగుతుందని. పాఠశాలల్లో బాలికలను చైతన్య పర్చడానికి బాలికల వారోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో చైతన్యం తీసుకురావడం వారికి ప్రభుత్వం కలిపించే అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. అలాగే 8,9,10 వ తరగతి విద్యార్థులకు సమాజంలో బాలికల ప్రాముఖ్యత వ్యాసరచన, లింగ వివక్షత అంశంపై వక్తృత్వపు పోటీలు నిర్వహించి ఉత్తమప్రతి భ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా తాహిసీల్దారు మహ్మద్ అజారుధీన్, మునిస్వామి నాయక్, మస్తానబీ, ఐసీ డి యస్ సూపర్ వైజర్ రమాదేవి, ఉపాధ్యాయులు మహిళా పోలీస్ లు అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి

మైదుకూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని పట్టణ గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలి. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగ సుబ్బారెడ్డి శుక్రవారం మైదుకూరు పట్టణ ఆకుల కాంప్లెక్స్ నందు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు డి.సుబ్బరాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలో అన్ని మండలాలలో అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయని పంటలు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలన చేసి పంట నష్టాన్ని ఎన్నుమరేషన్ చేసి రైతులకు నష్ట పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టేవలెనని, పంట నష్టపోయిన రైతులకు 90 శాతం సబ్సిడీతో రబీ సీజన్‌కు కావలసిన విత్తనాలను అందించాలని, మైదుకూరు పట్టణం తో పాటు నియోజకవర్గంలో గతంలో అనేక ఆక్రమణలు జరిగాయని ఇప్పుడు కూడా ఆక్రమణలు కొనసాగుతున్నాయని ఆక్రమణల ఫలితంగా వర్షానికి లోతట్టు ప్రాంతాలలో ఇండ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రహదారులు వెంబడి కూడా నీరు పారుతూ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి ప్రజలు అవస్థలకు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం ఆక్రమణలపై దృష్టి సాధించి ఆక్రమణలు తొలగించుటకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ పేద ప్రజలకు పట్టణాలలో 2, గ్రామాలలో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని అర్జీలు ఇచ్చి అనేక పర్యాయాలు పోరాటాలు, ఆందోళనలు నిర్వహించినప్పటికీ ఎటువంటి చర్యలు లేవన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు బీవీ. శ్రీనివాసులు, పి. ప్రభాకర్, బి. పీరయ్య, ఎస్. నారాయణ, ఎస్. బాలసుబ్బయ్య, పి. పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

పెనగలూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త

కలెక్టర్ సూచనల మేరకు రాగల నాలుగు రోజుల్లో అనగా 26 నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాకు ఆరంజ్ అలర్ట్ ఉన్నందున తుఫాను మరియు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన ఉన్నందున ముందస్తు చర్యగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తుఫాన్ సమయంలో గ్రామ రెవెన్యూ అధికారి వారి సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలోనే ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి ఉన్నత అధికారులకు తెలపాలన్నారు. చెరువులు వాగులు వద్దకు వెళ్లొద్దని గ్రామంలోని పిల్లలను చెరువులు బావులు కాలువల ఈతకు పంపరాదని కరెంట్ ఫోన్లు కరెంటు ట్రాన్స్ఫార్మర్లు కూలిపోవుటకు సిద్ధంగా ఉన్న గోడలు ఒక ఎరా వద్దకు పిల్లలను పంపరాదని తల్లిదండ్రులకు సూచనలివ్వాలన్నారు. పైన తెలిపిన విధుల యందు ఎవరైనా నిరక్ష్య ధోరణి ప్రదర్శించిన యెడల విపత్తు నిర్వహణ చట్టం 2005 ప్రకారం అధికారులపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శనగ విత్తనాల నమోదు ప్రక్రియపై సమావేశం

ముద్దనూరు,అక్టోబర్ 25, ప్రభాతవార్త :

శనగ పంటను సాగు చేసే మండల రైతులు సోమవారం నుంచి 25 శాతం రాయితీతో శనగ విత్తనాలను వారి పరిధి లోని రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి ఆన్లైన్ లో నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ఏవో వెంకటకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. శనగలు క్వింటా రూ.7800 రూపాయలు కాగా ప్రభుత్వం రాయితీతో రూ.1950 రాష్ట్ర ప్రభుత్వం భరించి రైతు వాటాగా రూ.5850 నగదు చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయ భవనంలో శనివారం నాడు రైతు సేవా కేంద్ర క్షేత్రస్థాయి సిబ్బందితో రాయితీ సెనగ విత్తనాల నమోదు ప్రక్రియపై పలు సూచనలు సలహాలు నమోదు లో ఎటువంటి తారతమ్య భేదాలు లేకుండా నిష్పక్షపాతంగా నమోదు ప్రక్రియ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బయోమెట్రిక్ యంత్రాలను క్షేత్రస్థాయి సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీసుకున్న ప్రతి రైతు తప్పకుండా శనగ పంట సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

తుఫానుపై అధికారులు విస్తృత ప్రచారాలు

మదనపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

మూడు రోజులు పాటు తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటుందంటూ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు కరపత్రాలు ద్వారా, మైకుల ద్వారా పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. భారీ వర్షాలు దృష్ట్యా ప్రజలు అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని హెచ్చరిస్తున్నారు. అవసరమైతే కంట్రోల్ రూమ్ లను సంప్రదించాలని తెలియజేస్తున్నారు. సబ్ కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, మండల తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ తుఫాన్ ప్రభావం పై అధికారులు భారీ ఎత్తున హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పాఠశాలలకు సైతం రెండు రోజులు పాటు సెలవులు ప్రకటించారు. మదనపల్లి రెవెన్యూ డివిజన్లో ప్రతి ఒక్కరు భారీ వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తున్నారు.

మదనపల్లె - బెంగళూరు బస్సు సర్వీసులు పెంచండి

మదనపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

మదనపల్లె నుండి బెంగళూరుకు వెళ్లే కీలకమైన రూట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సర్వీసుల కొరతపై బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మదనపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు, బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ అధికారులు కొందరు ప్రైవేట్ బస్సు యజమానులతో కుమ్మక్కై, ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ బస్సు సర్వీసులను పెంచకుండా అడ్డుకుంటున్నారని పునీత్ ఆరోపణ చేశారు. ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా, ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించి, మదనపల్లెబెంగళూరు రూట్‌లో ఆర్టీసీ బస్సులను పెంచాలని పునీత్ డిపో మేనేజర్‌ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు జిలాని భాష, నవీన్, ఆది, వినయ్, సుబ్రహ్మణ్యం, బ్రహ్మ, బాలకృష్ణ, శశి కుమార్, మనీష్, సంతోష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త భౌతికకాయనికి నివాళి

సంబేపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

మంత్రి రాంప్రసాద్ రెడ్డి మేనల్లుడు మోర్య రెడ్డి శనివారం మండలంలోని నారాయణరెడ్డి గారిపల్లె గ్రామం, మద్దిరాలపల్లిలో ఉండే టిడిపి కార్యకర్త బర్నేపల్లి వీరమల్లు అనారోగ్యంతో మరణించన విషయం కార్యకర్తల ద్వారా తెలుసుకొని వారి ఇంటి వద్దకు వెళ్లి వారి భౌతికాయానికి నివాళులర్పించి, అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తెలుగుదేశం పార్టీ మీకు అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు

పీలేరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:

మాట్లాడుతున్న ఎన్నికల నమోదు అధికారి

పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎన్నికల నమోదు అధికారి అమరనాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పీలేరు అసెంబ్లీ నియోజకర్గం 163లో 1200పైచిలుకు ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు. 30 ఉన్నాయని తెలిపారు. వాటిని పునర్విభజన చేస్తామని తెలిపారు. గతంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పునర్విభజనతో 301 పోలింగ్ కేంద్రాలు అవుతాయని తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. శివకుమార్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కుట్రలను బహిర్గతం చేద్దాం

గాలివీడు, అక్టోబర్ 25(ప్రభాతవార్త):



ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం పన్నిన కుట్రలకు చెక్ పెట్టేందుకు వైసీపీ రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతోందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం గాలివీడు మండలంలోనిపూలికుంట, బోరెడ్డిగారిపల్లె, పందికుంట, కొర్లకుంట, తలముడిపి, నూలివీడు, సీసీ పల్లె, గుండ్లచెరువు, గరుగుపల్లె, ప్యారంపల్లె, గోపనపల్లె గ్రామాల ప్రజలు, వైసీపీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కుట్రలను బహిర్గతం చేద్దామన్నారు. పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా సుదర్శన్‌రెడ్డి, మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, రాష్ట్రయువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మా అమరనాథరెడ్డి, నిజాముద్దీన్, సర్పంచులు ఉమా ప్రభాకర్, ఉమాపతిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సంస్థాగత అవగాహన విస్తృత సమావేశం

జమ్మలమడుగు, అక్టోబరు 25, ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైసీపీ సంస్థాగత అవగాహన విస్తృత సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, గిరిధర్ రెడ్డి, ఇందిరమ్మలు పాల్గొని ప్రసంగించారు. వజ్ర భాస్కర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, మండల ప్రెసిడెంట్, మండల పరిశీలకులు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ అనుబంధం విభాగాల నాయకులకు పార్టీ సంస్థాగత అవగాహన (శిక్షణ సమావేశాల) గురించి క్లుప్తంగా వివరించారు.

ఎస్సార్సైటీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 25, ప్రభాతవార్త:

సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాదుకు చెందిన ప్రముఖ సంస్థ పవర్ మెక్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బీటెక్ చివరి ఏడాది సివిల్ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో జమాలుద్దీన్, అశోక్, చంద్ర, శుభా అఖిల్, మహమ్మద్ హనీఫ్, సుల్తాన్ ఎంపికై ఏడాదికి రూ.3లక్షల వేతనంతో ఆఫర్ లెటర్లు పంపించారని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటేశ్వరరెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.ముస్తఫా, హెచ్ఓడీలు విద్యార్థులను అభినందించారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు

జమ్మలమడుగు, అక్టోబరు 25, ప్రభాతవార్త:

స్థానిక చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐఈసీ హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమం జమ్మలమడుగు సాయి పరమేశ్వర జూనియర్ కాలేజీలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణమోహన్‌రెడ్డి, లెక్చరర్లు మనోహర్, మస్తా

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

దేశభక్తికి, సేవాభావానికి ప్రతీక స్కౌట్స్,

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి,

జిల్లా విద్యాశాఖాధికారి వెల్లడి.

రాయచోటి అక్టోబర్ 25 ప్రభాతవార్త

అన్ని రకాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్ ను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. రాయచోటి లోని డైట్ నందు శనివారం నుండి ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు 7 రోజుల రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో చిన్ననాటి నుండే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం(స్కౌట్స్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందన్నారు.స్కౌట్ నందు ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను అక్టోబర్ 31వ తేదీ లోపల bsgindia.org ఆన్లైన్ పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల్లో స్కౌట్ కార్యకలాపాలను నిర్వహించాలన్నారు. స్కౌట్ సర్టిఫికెట్స్ కలవారికి విద్యా ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మరొక ముఖ్యఅతిథి ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యూనిఫామ్‌తో పాటు 32 జతల స్కౌట్ యూనిఫామ్ ను కూడా పంపిణీ చేయడానికి ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేస్తామన్నారు. యూనిట్ లీడర్లకు గౌరవ వేతనం అందించేందుకు, వారికి బదిలీలలో ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, ఎల్ఓసిలు (లీడర్ ఆఫ్ ది కోర్స్) జయరాం, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, శకుంతల, అబ్జర్వర్ కమల కన్నన్, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్స్ రమణయ్య, లక్ష్మీకర్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, యువ ఆపదమిత్ర నోడల్ ఆఫీసర్ గురునాథరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, స్కౌట్ జిల్లా కోశాధికారి మార్ల ఓబుల్ రెడ్డి, జిల్లాలోని 160 మంది అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టన్లు పాల్గొన్నారు.

ఆడబిడ్డల రక్షణకు వరం శక్తి యాప్

బద్వేల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

శక్తి యాప్ ఆడబిడ్డల రక్షణకు వరం లాంటిదని శక్తి యాప్ టీం సభ్యులు బి.మురళి అన్నారు.శ్రీ బిజముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం 1వ యూనిట్ తరపున దత్తత గ్రామమైన చిన్నకేశంపల్లెలో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపులో నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఎన్ ఎస్ ఎస్ యూనిట్ 1 సమన్వయకర్త డా. యమ్. దొరస్వామినాయక్, 50 మంది వాలంటీర్లతో గ్రామంలో పర్యటి0చి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం యువతులపై జరుగుతున్న ఆరాచకాల నుండి తప్పించుకోవడానికి ఈ శక్తి యాప్ చాలా ఉపయోగపడుతుందని యువతకు యాప్ ను డౌన్లోడ్ చేసుకొని ఆపద సమయాలలో, ఈవిటిజింగ్, ర్యాగింగ్ వంటి సందర్భాలలో రహస్యంగా ఈ యాప్ ను ఉపయోగించుకొని సమస్యనుండి బయట పడవచ్చని చెప్పారు. ఈ యాప్ ఏ విధంగా డౌన్లోడ్ చేసుకోవాలి, ఎలా వినియోగించుకోవాలో కూడా వివరించారు. కార్యక్రమములో సచివాలయం సిబ్బంది, పి. కవిత, ప్రధానోపాధ్యాయులు జి. పెంచలయ్య, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

బద్వేల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

పరిసరాలను శుభ్రతగా ఉంచుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని యు పి హెచ్ సి కోటవీధి మెడికల్ అధికారి డాక్టర్ సౌమ్య అన్నారు. పట్టణంలోని షిర్డీ సాయిరాం హైస్కూల్ నందు దోమల నివారణ సమావేశంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇంద్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ ఎక్కువగా దోమల వల్ల వచ్చే వ్యాధుల్లో డెంగు వ్యాధి ఎడిస్ ఈజిప్టై అనే ఆడదామ కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుందని ఈ వ్యాధి లక్షణాలు విపరీతమైన జ్వరము ఒళ్ళు నొప్పులు కంటి వెనక భాగాన నొప్పి ఇకారమైన వాంతులు ఒళ్ళు పైన చన్నటి ఎర్రటి మచ్చలు ఉంటే ఇది డెంగు లక్షణాలుగా గుర్తించాలని అన్నారు వాతావరణం పూర్తిగా మారిందని అలాగే వర్షాలు ఎక్కువ పడుతున్నాయని నీరు కాచి వడగట్టి తాగాలన్నారు. రెండు మూడు రోజుల్లో మించి నీటి నిలువలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి ఈ దోమల వల్ల డెంగు మలేరియా చికెన్ గునియా బోధకాలు మెదడువాపు జ్వరాలు వస్తాయన్నారు. లార్వా వల్ల వచ్చే నష్టాలు విద్యార్థులకు చెప్పడం జరిగింది అలాగే హ్యాండ్ వాష్ గురించి దోమల నివారణకి మస్కుటిల్ ఆల్ ఔట్ ఆరోగ్యానికి హానికరమని రాత్రిపూట వేపాకు పొగ దోమలు అంతరించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలని దోమ పుట్టకుండా కొట్టకుండా చూసుకోవాలన్నారు. ప్రతిరోజు సిబ్బంది చేత జరాలపై వ్యాధుల బారిన పడకుండా ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు ఈ సర్వేలో జ్వరాలు పూర్తిగా అదుపులో ఉన్నాయన్నారు ఈ కార్యక్రమానికి హెడ్మాస్టర్ కృష్ణారెడ్డి ఉపాధ్యాయ బృందము హెల్త్ అసిస్టెంట్ ఎస్ శ్రీరామయ్య ఏఎన్ఎం చైతన్య ఆశ పద్మ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు

రామసముద్రం అక్టోబర్ 25 ప్రభాతవార్త

మదనపల్లి బిటి కళాశాల మైదానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా హ్యాండ్ బాల్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ జట్ల ఎంపికలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెంబకూరు విద్యార్థులు అద్భుతమైన ఆట తీరుతో కనబరిచి హ్యాండ్ బాల్ అండర్ 17 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపి కయ్యారు. అండర్ 17 బాలుర విభాగంలో ఎస్. కార్తిక్ రాజు, అండర్ 17 బాలిక విభాగంలో జి. గుణశ్రీ, అండర్ 14 బాలుర విభాగంలో కే. లోచన్ సాయి అండర్ 14 బాలికల విభాగంలో కే. జాహ్నవి, ఎన్. మహిత, పి. రాధ లు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలియజేసారు. వీరు ఈ నెల 30 తేదీ నుండి గుంటూరు పట్టణంలో జరుగు అండర్ 17,14 రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తార ని జిల్లా మహిళా కార్యదర్శి ఝాన్సీ తెలియజేశారు.రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ అండర్ 17,14 పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యా యులు కే. రమేష్ బాబు, పిడి దిలీప్‌కుమార్, ఎం. మంజుల ఉపాధ్యాయు లు అభినందనలు తెలిపారు. హెచ్ఎం రమేష్ బాబు మాట్లాడుతూ చెంబకూరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు తల్లి దండ్రులకు మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.

రహదారి భద్రత, చట్టాలపై అవగాహన

మైదుకూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

పట్టణంలోని విఆర్ జూనియర్ కళాశాలలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మెద్దిన్ అధ్యక్షతన రహదారి భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తహశీల్దార్ రాజసింహ నరేంద్ర మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ రావ్, సిఐ రమణారెడ్డి,కరెస్పాండెంట్ వెంకట రాముడు,బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లి : అక్టోబర్ 25 ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్, న్యాయమూర్తి సి.హెచ్. భరత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన లక్కిరెడ్డిపల్లె లోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సిహెచ్ భరత్ మాట్లాడుతూ నేటి సమాజంలో యువత ఎక్కువగా చెడు అలవాట్లకు బానిస అవుతున్నారన్నారని, చెడు వ్యసనాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలన్నారు. అసిస్టెంట్ రోడ్ అండ్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడపాలంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అర్హత ఉన్న ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్‌కు అప్లై చేసుకోవాలన్నారు. వాహనానికి తప్పకుండా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. లక్కిరెడ్డిపల్లె ఎస్సై రవీంద్రబాబు మాట్లాడుతూ యువతగంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలన్నారు. తమ సెల్ ఫోన్ కు వచ్చే ఓటీపీలు ఎవరికి చెప్పవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచేదో చెడేదో తెలుసుకొని అడుగులు వేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, సిద్దయ్య, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్జిసి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

మొక్కలు నాటుతున్న దృశ్యం

పీలేరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:

కలికిరి పట్టణం ఇందిరమ్మ కాలనీలోని జడ్.పి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఎన్.జి.సి ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, పాఠశాల పరిసరాలను పచ్చదనంతో నింపడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయిని వి.హసీనా మాట్లాడుతూ ప్రకృతి మనకు ఇచ్చిన అమూల్యమైన వరం. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలనే బాధ్యత తీసుకుంటే భవిష్యత్తులో మన పరిసరాలు పచ్చగా, పరిశుభ్రంగా మారతాయి. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంచుతాయన్నారు. ఎన్.జి.సి కోఆర్డినేటర్ జానం సుజాత మాట్లాడుతూ ఎ పర్యావరణ సంరక్షణ అంటే కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలి. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ఫిజికల్ డైరెక్టర్ టి.రెడ్డి మోహన్ రెడ్డి కృషి ప్రశంసనీయం. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని క్రమం తప్పకుండా సంరక్షిస్తే పాఠశాల ప్రాంగణం మరింత సుందరంగా మారుతుంది" అని తెలిపారు. పై కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ టి.రెడ్డి మోహన్ రెడ్డి, బోధనా సిబ్బంది పి.సబిత, ఎం.అశోక్ నాయక్,కరుణ కుమారి,ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, బోధన సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు పూలు, పండ్ల చెట్లు, నీడనిచ్చే మొక్కలు నాటి వాటికి నీరు పోసి సంరక్షణ బాధ్యతలు స్వీకరించారు. చివరగా పాల్గొన్న వారందరికీ పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ముగించారు.

పురమిత్ర యాప్ పై అవగాహన

బద్వేలు అర్బన్, అక్టోబర్ 25 , ప్రభాతవార్త:

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం పురమిత్ర యాప్ పై మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ హెచ్ జి సభ్యులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాటట్లాడుతూ పురమిత్ర యాప్ గురించి యసోచి మెంబర్లతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పీఎం స్వానిధి లోన్లు అర్హులైన ప్రతి ఒక్కటికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటితోపాటు మనమిత్ర ద్వారా అందే వాట్సాప్ సేవల గురించి ప్రజలకు తెలియజేయాల ఉన్నారు. పురపాలక సంఘానికి చెందిన అన్ని రకాల పన్నులు చెల్లించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ పాటు మేనేజర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, మెప్మా సీఎంఎం, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ షా వల్లి కట్ట వద్దకు ఎవరు వెళ్లకండి

నిమ్మనపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

నిమ్మనపల్లి మండలం సయ్యద్ షా వల్లి కట్ట వద్దకు ఎవరో వెళ్ళరాదు అంటూ పోలీస్ వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్నటువంటి వర్షాల కారణంగా నిమ్మనపల్లి నందు సయ్యద్ షా వలి కట్ట వద్ద ఉన్నటువంటి అహోబిల నాయిని చెరువు నిండి మొరవ పొంగుతోందని అందువల్ల నిమ్మనపల్లి మండల ఎమ్మార్వో ఉత్తర్వుల మేరకు నేటినుండి .01.11.2025 వరకు సయ్యద్ షా వలి కట్ట వద్దకు సందర్శకులు, భక్తులు ఎవరు రాకుండా ఉండవలెను అధికారులుకు సహకరించాలన్నారు.

వైభవంగా ప్రారంభమైన కార్తీకమాసం

గోపవరం. సెప్టెంబర్. 25ప్రభాతవార్త.

బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు కార్తీక మాసం స్వామి అమ్మవారికి వైభవంగా అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది, తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక వెండి ఆభరణాలతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు, తదుపరి వచ్చిన భక్తులు మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారి మూల విరాట్ అలంకరణ చాలా కన్నులకు కనువిందుగా ఉంది అని స్వామి, అమ్మ వారిని చూస్తూ ఉంటే వారు మా సమస్యలను అడిగి మా సమస్యకు వారు పరిష్కారం తెలిపినట్లుగా మా మనసుకు భావం కలుగుతూ ఉంటుందని వచ్చిన భక్తులు తెలిపారు,తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించినవారు వల్లేర వారి పల్లె గ్రామానికి గుర్రంపాటి. వెంకట్ రెడ్డి ధర్మపత్ని లక్ష్మి దేవి వీరి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

మొక్కల ప్రాముఖ్యత, ఆరోగ్యం పట్ల అవగాహన

వేంపల్లె అక్టోబర్ 25: ప్రభాతవార్త

ఆర్జీయూకేటీ ఆర్కే ర్యాలీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 11, 13,14, 15 లు నాలుగవ రోజు ప్రత్యేక శిబిరాలను కొండవాండ్లపల్లి, కుమ్మరాంపల్లి, కుమారకాల్వ, తాళ్లపల్లి గ్రామాలలో నిర్వహించారు. శనివారం మొక్కలు నాటి వాటి యొక్క ప్రాముఖ్యతను, అదే విధంగా మహిళ ఆరోగ్యం పట్ల మరియు చదువు వంటి అంశాలపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలను చైతన్య వంతులు చేసే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమలను ఎన్ఎస్ఎస్ యూనిట్ 11, 14,15 ఆఫీసర్లు గోవర్ధన్, తిరుపతిరెడ్డి, మరియు సుబ్బరాయుడు కొనసాగించారు. యూనిట్ 13ను ప్రోగ్రాం ఆఫీసర్ రిజిస్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర సూచనలు మేరకు దీప్తి, నదీష్, ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఎన్‌శాట్ పరీక్షల్లో...

గాలివీడు, అక్టోబర్ 25(ప్రభాతవార్త):

మండల కేంద్రంలోని అద్వైత గురుకులం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్.షయాన్ 2025 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఫిజిక్స్ వాల్ ఎన్‌శాట్ (నేషనల్ స్కాలర్‌షిప్ కమ్ అడ్మిషన్ టెస్ట్) జాతీయ స్థాయి పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా ఫిజిక్స్ విభాగంలో 11వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ డా.ఇంద్రసేన మాట్లాడుతూ ఎన్‌శాట్ దేశవ్యాప్తంగా ప్రఖ్యాత ఫిజిక్స్ వాల్ సంస్థ నిర్వహించే ఈ పరీక్ష ద్వారా విద్యార్థులకు వంద శాతం నిర్వహించే ఈ పరీక్ష ద్వారా విద్యార్థులకు వంద శాతం వరకు స్కాలర్‌షిప్ అవకాశాలు లభించి, వారు జేఈఈ, నీట్, ఫౌండేషన కోర్సుల్లో అర్హత సాధించగలరన్నారు. పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ షయాన్ విజయానికి ఉపాధ్యాయుల మార్గదర్శకత తల్లిదండ్రుల ప్రోత్సాహం మరియు విద్యార్థి నిరంతర కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, ఫిజిక్స్ ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలం యోధుల సన్మానంలో కృష్ణకు గౌరవం

పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త:

విజయవాడ వాసవి క్లబ్ గ్రేటర్ రీజినల్ ఆఫీసులో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టులందరికీ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. "కలం యోధుల సన్మానం" పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ ప్రధాన అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణానికి చెందిన జర్నలిస్టు తులసి కృష్ణను రామకృష్ణ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. అనంతరం తులసి కృష్ణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జర్నలిస్టులకు మరింత ఉత్సాహం, స్ఫూర్తిని నింపేలా ఉంటాయని, ఇది గౌరవంగా భావిస్తున్నానన్నారు.

కల్తీ మద్యాన్ని క్యూఆర్ కోడ్‌తో అరికట్టవచ్చు

ప్రొద్దుటూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త

రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టిందని ఆ క్యూఆర్ కోడ్ ద్వారా కల్తి మద్యాన్ని అరికట్టే అవకాశం ఉందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కల్తీ మద్యం ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ క్యూ ఆర్ కోడ్ సిస్టం తెచ్చిందని, దీని ద్వారా నకిలీ మద్యాన్ని అరికట్టవచ్చని, నకిలీ మద్యం తేలితే అధికారులకు సమాచారం ఇవ్వాలని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ గత ప్రభుత్వంలో జే బ్రాండ్స్ ద్వారా ఎంతోమంది మరణించినా లెక్క చేయలేదని, ప్రస్తుతం వారి మనుష్యులు ఈ పని చేస్తున్న ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదని హితువు పలికారు. నకిలీ మద్యం గురించి మాట్లాడే నైతికత వైసీపీ వారికి లేదన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఈ నకిలీ మద్యం బాటిల్స్ చూపి, అవగాహన ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు ఈ.వి. సుధాకర్ రెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ.

చిట్వేలి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండల విద్యాశాఖ అధికారి 1 గా బాధ్యతలు తీసుకున్న ఖాజా మొయి ద్దీన్ శనివారం ప్రాథమిక పాఠశాల (మెయిన్ స్కూల్ ను) తనిఖీ చేశారు. బోధనా సిబ్బందికి, పిల్లలకు పలు సూచనలు చేశారు. బోధన విధానం పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఉండాలని, పిల్లల సమగ్ర అభివృద్ధికి పునాదులు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, పిల్లలతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహకార గృహనిర్మాణ సంఘం అధ్యక్షుడిగా షంషీర్

మదనపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త

మదనపల్లె సహకార గృహ నిర్మాణ సంఘం నూతన కార్యవర్గం శనివారం కొలువుదీరింది.అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్నికల అధికారి కే.రాజశేఖర్ రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షుడిగా ఎస్.రెడ్డి షంషీర్,ఉపాధ్యక్షుడిగా ఎన్.రెడ్డెప్ప (రెడ్డి రాయల్),కార్యదర్శిగా బి.మహేష్ కుమార్ (చిన్న మహేష్), సభ్యులుగా చల్లా చలపతి,శివానందర్ నాయక్,నరేష్,శివాజీ రాయల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి షంషీర్ మాట్లాడుతూ శాసనసభ్యులు షాజహాన్ బాషా ఆశీస్సులతో మదనపల్లె సహకార గృహనిర్మాణ సంఘం అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించడం హర్షించదగ్గ విషయమన్నారు.అదేవిధంగా ఎమ్మెల్యే సూచనలు, సలహాలతో మదనపల్లె సహకార గృహనిర్మాణ సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ పదవికి తాను ఎంపిక కావడానికి సహకరించిన టిడిపి నాయకులు,కార్యకర్తలు,కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.టిడిపి సీనియర్ నాయకులు,టౌన్ బ్యాంక్ డైరెక్టర్ నాదెళ్ల శివన్న నూతన కార్యవర్గాన్ని పూలమాల,శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కే.ప్రవీణ్ కుమార్ (పర్సన్ ఇంచార్జి),రోషన్ జమీర్ (డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి సహకార గృహనిర్మాణ సంఘం కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

ముంతా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త:

ముంతా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు ముంతా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే వంకలు, వాగులు, నదులు, చెరువుల, జలాశయాలు అన్ని కుండలా ఉన్నాయని తెలిపారు. ప్రమాదం పొంచివున్న ప్రదేశాలను అధికారులు గుర్తించి ప్రమాద హెచ్చరికలు చూపుతూ రేడియం. రిబ్బన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తుఫాన్ సందర్భంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూముకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎక్కడైనా ప్రమాదం పొంచివున్న ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశాలు ఇస్తే తక్షణం ఖాళీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివకుమార్, ఎంపీడీవో శివశంకర్, సీఐ యుగంధర్, ఏవో రమాదేవి, హెచ్ సుకుమార్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ ఝా